సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం : 28 : మార్చి : 2024

ఇఫ్తార్ 6-34
(గురువారం సాయంత్రం)

సహర్ 4-51
(శుక్రవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు



ఏసీబీ వలలో తహసీల్దార్

రైతు నుంచి లంచం తీసుకుంటున్న గుండుమాల్ తహసీల్దార్‌ను ఏసీబీ పట్టుకుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /18.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం రాష్ట్ర స్థాయిలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నామని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు(దాత గంగుల నర్సింహారెడ్డి ఆలయ కమిటీ మాజీ చైర్మన్), ద్వితీయ బహుమతి రూ.40 వేలు (దాత కొత్త మధుసూదన్‌రావు పెద్దాపూర్), తృతీయ బహుమతి రూ.30 వేలు (దాత అనంతప్రతాప్‌రెడ్డి జెడ్పీటీసీ), నాలుగో బహుమతి రూ.20 వేలు(దాత రామచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ మామిళ్లపల్లి), ఐదో బహుమతి రూ.10 వేలు (దాత దుడ్డు ఎర్రయ, ఉత్సవ కమిటీ సభ్యులు) నగదు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకు 9912126438, 9441378032 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన హుండీని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. మండలంలోని పాలెంకు చెందిన అలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, శివరాత్రి సందర్భంగా మూడు నెలలకోసారి హుండీ ఆదాయం లెక్కిస్తారు. ఈ లెక్కింపు సందర్భంగా రూ.3,88,673 ఆదాయం వచ్చిందని వివరించారు.

అర్హులైన ప్రతి చిన్నారికి వ్యాక్సినేషన్



నాగర్‌కర్నూల్: అర్హులైన ప్రతి చిన్నారికి వ్యాక్సినేషన్ వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్ తెలియజేశారు. బుధవారం ఉయ్యాలవాడ సబ్‌సెంటర్‌లో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ముందుగానే తయారు చేసుకున్న లబ్ధిదారుల వివరాల ప్రకారం వాక్సిన్ చేయించాలని, ఏ ఒక్క చిన్నారిని వదిలేయొద్దని సూచించారు. వాక్సిన్ నమోదు వివరాలను యూ విన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతా సిద్ధం..

నేడు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక



అచ్చంపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- మొత్తం 1,439 మంది ఓటర్లు.. 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- బ్యాలెట్ తదితర ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి
- ప్రతి సెంటర్‌కు మైక్రో అబ్జర్వర్.. పోలీసుల పటిష్ట బందోబస్తు
- కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్ కుమార్‌రెడ్డి పోటీ
- గెలుపుపై ఎవరిధీమా వారిదే.. గురువారం ప్రత్యేక బస్సుల్లో రాక
- ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు	మహిళలు	పురుషులు
1,439	795	644

కౌన్సిలర్లు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
449	888	83

ఎమ్మెల్యేలు	ఎంపీలు	ఎమ్మెల్సీలు
14	2	3

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక క్లైమాక్స్‌కు చేరింది. గురువారం పోలింగ్ జరగనుండగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు అంతా సిద్ధం చేశారు. స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలక కౌన్సిలర్లు.. వీరితోపాటు ఎక్స్ అఫీషియో హోదాలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతో పాటు ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం 1,439 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వచ్చే నెల రెండో తేదీన మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి..

బ్యాలెట్ ద్వారా ప్రజాపతినిధులు ఓట్లు వేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రంగా అన్ని పోలింగ్ సెంటర్లకు ఎన్నికల సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. ప్రత్యేక వాహనాల్లో వీటిని పోలింగ్ స్టేషన్లకు తరలించారు. ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లలో భాగంగా ప్రతి సెంటర్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. అదనంగా మరో ఐదుగురిని అందుబాటులో ఉంచారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి..

లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పోరు కావడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటివరకు ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుని పరువు కాపాడుకోవాలని బీఆర్‌ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో సైతం గెలిచి సత్తా చాటాలని పట్టుదలతో ముందుకు సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో జరుగుతున్న ఉపఎన్నిక కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

ఎవరి ధీమా వారిదే..

ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి పోటీ పడుతున్నారు. 2021లో బీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయిలో బలముండగా.. అప్పటి పార్టీ అభ్యర్థులు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్‌ఎస్‌కు 1,039 మంది, కాంగ్రెస్‌కు 241 మంది, బీజేపీకి 119, ఇతరులు 46 మంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. అయితే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిలో బరిలో నిలిచి గెలుపొందారు. ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్సీగా రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో హస్తం శ్రేణుల్లో గెలుపుపై ధీమా వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ సైతం తమదే గెలుపు అని చెబుతోంది.

క్రాస్ ఓటింగ్ బెంగ..

ఓటర్లు చేజారొద్దనే ఉద్దేశంతో వారిని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటాపోటీగా గోవా, ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించాయి. గురువారం పోలింగ్ జరగనుండగా.. బుధవారం తెల్లవారుజామునే క్యాంపుల నుంచి తరలించినట్లు తెలుస్తోంది. రాత్రికి వారిని హైదరాబాద్‌లో రిసార్ట్స్‌కు తరలించి.. గురువారం ఉదయం నేరుగా ప్రత్యేక బస్సుల్లో ఆయా పోలింగ్ సెంటర్లకు తీసుకురానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇరువురిలోనూ క్రాస్ ఓటింగ్ టెన్షన్ పట్టుకుంది. ఇప్పటివరకు అంతా సజావుగా జరిగినప్పటికీ.. చివరి నిమిషంలో ప్రజాప్రతినిధులు ఎవరు ఎటువైపు మొగ్గు చూపుతారోననే భయం వారిలో నెలకొన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అచ్చంపేటలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట రూరల్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉపఎన్నిక నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఉపఎన్నిక నిర్వహణ పోలింగ్ ఏర్పాట్లపై మౌలిక వసతులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఏఆర్వోలు, నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ పట్టణంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున జిల్లాలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 319 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. కాగా అచ్చంపేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పది పరీక్ష కేంద్రం, ఎమ్మెల్సీ పోలింగ్ ఏర్పాటు చేయడంలో 'అధికారుల సమన్వయ లోపం' అని బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన అంశంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెట్ రూపంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

నాగర్‌కర్నూల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ రూపంలో కొనసాగనున్నాయని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలియజేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన శాసన మండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని బుధవారం సందర్శించి వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా మా ట్లాడారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలో 101 మంది ఓటర్లు బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్ ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు..

పోలింగ్ స్టేషన్	పురుషులు	మహిళలు	మొత్తం
ఎంపీడీఓ కార్యాలయం, మహబూబ్‌నగర్	117	128	245
ఎంపీడీఓ కార్యాలయం, కొడంగల్	27	29	56
ఎంపీడీఓ కార్యాలయం, నారాయణపేట	89	116	205
ఆర్డీఓ ఆఫీస్, వనపర్తి	99	119	218
జెడ్పీ కార్యాలయం, జోగులాంబ గద్వాల	91	134	225
బాలికల జూనియర్ కళాశాల, కొల్లాపూర్	28	39	67
బాలుర జెడ్పీహెచ్‌ఎస్, నాగర్‌కర్నూల్	48	53	101
బాలికల జెడ్పీహెచ్‌ఎస్, అచ్చంపేట	37	42	79
ప్రభుత్వ జూనియర్ కళాశాల, కల్వకుర్తి	31	41	72
ఎంపీడీఓ కార్యాలయం, షాద్‌నగర్	77	94	171

వైభవంగా వసంతోత్సవం

- స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు శ్రీచక్రస్నానం
- మన్యంకొండలో ముగిసిన అలివేలు మంగతాయారు ఉత్సవాలు



మన్యంకొండ గుట్టపై సుదర్శన పెరుమాళ్లకు శ్రీచక్రస్నానం చేయిస్తున్న పురోహితులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, అవబృత స్నానం, నాకబలి (నాగవెల్లి), ద్వాదశారాధన, సప్తవరణులు, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామివారి సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం నుంచి ఘాట్‌రోడ్డు గుండా గుట్టపై నున్న బావి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు పురోహితులు సంప్రదాయబద్ధంగా శ్రీచక్రస్నానం చేయించారు. మళ్లీ సుదర్శన పెరుమాళ్లను ప్రత్యేక పూలతో శోభాయమానంగా అలంకరించి దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి విశేషోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజలతో అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా శ్రమిద్దాం



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

అచ్చంపేట: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సమష్టిగా శ్రమిద్దామని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేటలోని ఏసీఆర్ గార్డెన్‌లో బీజేపీ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే.. పీఎం మోదీ ఆధ్వర్యంలో అచ్చంపేటను మరో అయోధ్యగా తీర్చిదిద్దుతామన్నారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితం అందరికి తెలుసని, కొంత మందిలా అచ్చంపేట ఆత్మగౌరవానికి ఎన్నడూ చెడ్డపేరు తీసుకురాలేదన్నారు. తమ హయాంలో హైదరాబాద్- శ్రీశైలం రహదారిని నాలుగు లైన్లుగా, భూత్పూరు- మద్దిమడుగు, గద్వాల రైల్వే లైన్ కోసం ప్రయత్నాలు చేశామన్నారు. కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి, తీగలవంతెన మంజూరు చేయించామన్నారు. బీజేపీ అభ్యర్థి ఎంపీగా గెలిస్తే.. మిగిలిన పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం: ఆచారి

త్వరలో జరిగే ఎన్నికల్లోనూ మోదీ ప్రభంజనంతో బీజేపీ 400 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని, అందులో నాగర్‌కర్నూల్ సీటు కూడా ఉంటుందని ఆచారి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. రాములు వదిలిన బాణం భరత్ మనకు దొరికిన అవకాశాన్ని వదులుకోవద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఒక పక్క అందరూ పార్టీని వీడుతుంటే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరి, అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను దొరల వద్ద ఊడిగం చేసేందుకు పెట్టారన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంటు కష్టాలు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, కట్టా సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రావు, మెట్టకాడి శ్రీనివాసులు, మండికారి బాలాజి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 'భరోసా'

చిన్నారుల రక్షణకు పటిష్ట చర్యలు

- ఇటీవల జిల్లా కేంద్రంలో 'భరోసా కేంద్రం' ఏర్పాటు
- లైంగికంగా వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు
- బాధితులకు అండగా నిలుస్తున్న పోలీసులు
- ఎస్పీ పర్యవేక్షణలో కేంద్రం పనితీరు



జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్(ఫైల్)

సంవత్సరం	అత్యాచారాలు	గృహహింస	పోక్సో	మహిళల వేధింపులు	ఈవ్ టీజింగ్
2022	76	121	85	124	11
2023	77	118	86	143	2
2024	13	21	18	24	2

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, చిన్నారులపై నిత్యం ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. అదుపు చేయలేకపోతున్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు, మైనర్లపై జరుగుతున్న లైంగికదాడులతో ఆందోళన నెలకొంది. ఎక్కడైనా లైంగికదాడులు జరిగితే చాలా మంది మహిళలు, మైనర్లు తమ పరువుపోతుందనే ఆలోచనలతో ఎవరికి చెప్పకుండా లోలోపలే మదనపడుతున్నారు. మరికొందరేమో ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైంగికదాడులకు గురై చిన్నారులకు అత్యవసరంగా న్యాయసేవలు అందించడంతో పాటు వారికి అవసరమయ్యే అన్ని సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రంలో గత నెల 6న భరోసా కేంద్రాన్ని ప్రారంభించి చిన్నారులకు సేవలు అందిస్తోంది.

బాధితులకు కౌన్సెలింగ్..

18 ఏళ్ల లోపు బాలికలు అత్యాచారానికి, లైంగికదాడులకు గురైనప్పుడు పోలీసులను సంప్రదిస్తే వెంటనే భరోసా కేంద్రానికి తరలించి అండగా నిలుస్తున్నారు. అత్యాచారానికి గురైన బాధితులకు వెంటనే వైద్య సేవలు అందించడంతో పాటు, న్యాయ సాయం, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు కలిసి కౌన్సెలింగ్ అందజేస్తున్నారు. భరోసా కేంద్రంలో లైంగికదాడులకు గురైన చిన్నారులకు వసతి కల్పించి న్యాయం అందేలా చూడటం, బాధితులకు అండగా ఉంటూ.. నేరస్తులకు సత్వరమే శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు. భరోసా కేంద్రం ఎస్పీ పర్యవేక్షణలో మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తూ.. మహిళలు, చిన్నారులకు అండగా నిలుస్తూ.. లైంగికదాడుల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నారు.

పోలీసుశాఖ పటిష్ట చర్యలు..

జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, వెల్దండ, అమ్రాబాద్ సర్కిళ్లలోని 22 పోలీస్‌స్టేషన్ల మహిళలు, చిన్నారులపై లైంగికదాడులు, వేధింపులు జరగకుండా పోలీసుశాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుంది. పోలీసుశాఖ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎదురయ్యే పరిణామాలపై, ఎదుర్కొనే శిక్షలపై అవగాహన కల్పిస్తున్నారు.


వేధిస్తే కఠిన చర్యలు



మహిళలు, చిన్నారులను లైంగికంగా వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. బాధిత చిన్నారులకు అండగా ఉండటం కోసం భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. లైంగిక వేధింపులకు గురైన చిన్నారులు, బాలికలకు భరోసా కేంద్రంలోనే వైద్య సాయంతో పాటు పోలీసు, న్యాయవాదుల సమక్షంలో కౌన్సెలింగ్ అందించి వారికి భరోసా కల్పించి నేరస్తులకు శిక్షపడేలా చూస్తాం. ఎవరికైనా ఏ సమస్య వచ్చినా.. డయల్ 100కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

తొలగించిన అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నాగర్‌కర్నూల్ రూరల్: కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని చింతపల్లిలో రాజకీయ కక్షలతో విధుల నుంచి తొలగించిన అంగన్‌వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా.. గ్రామాల్లో రాజకీయ కక్షలతో అంగన్‌వాడీలను తొలగించడం దుర్మార్గమని అన్నారు. తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల పనులకు వత్తాసు పలకడం సరైన చర్య కాదన్నారు. వారి ప్రతాపం అంతా కిందిస్థాయి అంగన్‌వాడీలపై చూపడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, శ్రీనివాసులు, పర్వతాలు, అశోక్, రామయ్య, చంద్రకళ, భారతి, నిర్మల, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్: వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని ఆరేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు ఇలా.. ఆరేపల్లికి చెందిన ఏటికాడి చిన్న నాగన్న(63) మంగళవారం రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున పాము కాటి వేసిందని కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

• యువకుడు బలవన్మరణం


రాజు (ఫైల్)

అమరచింత: వివాహ విషయంలో తల్లితండ్రులే తనను హేళన చేస్తూ, మందలించారని అవహేళన చేస్తూ మందలిస్తున్నారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పాంరెడ్డిపల్లెకు చెందిన రఘుపతిరెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె. వీరిలో చిన్న కుమారుడి వివాహంతో పాటు కూతురి వివాహం చేశారు. మిగిలింది పెద్ద కుమారుడు రాజు(22) పెళ్లి విషయంపై తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. డిగ్రీ చదువుతూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్న రాజు కొన్ని రోజుల కిందట ఇంటికి వచ్చాడు. రాజుతో తల్లితండ్రులు పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చారు. ఎవరి ఇంటికైన దత్తతగా వెళ్లాలని, ఇన్నేళ్లయినా పెళ్లి ఎందుకు చేసుకోవడం లేదన్న విషయాలపై కొడుకుతో వాదనకు దిగారు. తల్లితండ్రులు చెప్పిన మాటలకు విసుగు చెందిన రాజు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో తన తల్లి చీరను తీసుకుని బైక్‌పై బయటకు వచ్చాడు. మన్యంకొండలోని రాళ్ల మధ్యలో చెట్టుకు తల్లి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మన్యంకొండ గుట్టకు పశువులను తీసుకెళ్లిన కాపారులు మృతదేహం గురించి పోలీసులకు సమాచారం అందించారు .పోలీసులు రాజు తల్లితండ్రులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం మృతదేహన్ని పాంరెడ్డిపల్లెకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్‌పై వెళ్తున్న యువకుడిపై కత్తితో దాడి

బల్మూర్: బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని మైలారం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బత్తుల వినోద్ తన బైక్‌పై అచ్చంపేట నుంచి కిరాణ సామాను తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. వెనుక వైపు నుంచి హెల్మెట్లు ధరించి మరో వాహనంపై వెంబడించిన ముగ్గురు అతని వీపుపై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించారు. గమనించిన వినోద్ తప్పించుకోనేందుకు ప్రయత్నించడంతో అతని కుడి తొడపై కత్తి పోటు పడింది. ఆయన కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. గాయాలపాలైన వినోద్ జరిగిన విషయన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. చికిత్స నిమిత్తం యువకుడిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తగు చర్యలు తీసుకుంటామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. కాగా ఈ ఘటనలో అచ్చంపేట పట్టణానికి చెందిన యువకుడి బంధువులే ఉన్నట్లు బాధితుడితో పాటు కుటుంబసభ్యులు ఆరోపించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలుశిక్ష

మక్తల్: భార్యపై వరకట్న వేధింపులకు పాల్పడిన భర్తకు జైలు శిక్ష, జరిమానా కోర్టు విధించింది. మండలంలోని భూత్పూర్ చెందిన హరిజన్ నర్సింహ 2020, అక్టోబర్ 10వ తేదీన భార్య నర్సమ్మ కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ రాములు కేసు నమోదు చేశారు. పూర్తి స్థాయిలోకేసు విచారణ చేయగా నర్సమ్మ భూత్పూర్ రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలు తల్లి భీమమ్మను విచారణ చేయగా నర్సమ్మ, హరిజన్ నర్సింహులు ప్రేమించి పెళ్లి చేసుకున్నారని తెలిపారు. భర్త, వారి తల్లిదండ్రులు నర్సమ్మను అదనపు కట్నం కోసం తరుచూ వేధిస్తుండేవారని తెలిపారు. దీనిపై 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా బుధవారం నారాయణపేట జడ్జి అబ్దుల్ రఫీ కోర్టులో తీర్పునిచ్చారని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

వాహనం బోల్తా: నలుగురికి గాయాలు



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రం సమీపాన నాగనూలు శివారులో నాగర్‌కర్నూల్ వైపు వస్తున్న బలెరో వాహనం బుధవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలపాలైన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


గూడూర్ స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీని సరిచేస్తున్న సిబ్బంది

పాత పైపులైన్‌కే.. మిషన్‌భగీరథ కనెక్షన్

తాగునీటిని సరఫరా చేయాలి



మిషన్ భగీరథ తాగునీరు అందించే పైపులైన్ లీకేజీలు అవుతున్నాయి. దీంతో గ్రామానికి కలుషిత నీరు అందుతుంది. ఈ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఐదేళ్లుగా ఇలాగే కొనసాగుతుంది. పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో సమస్యపై అధికారులను నిలదీసినా పట్టించుకోలేదు.

– సత్యన్న, మాజీ సర్పంచ్, తిర్మలాపురం

ప్రతిపాదనలు పంపించాం..

మిషన్ భగీరథ పాత పైపులైన్ తొలగించి కొత్తది ఏర్పాటుకు ఇది వరకే ప్రతిపాదనలు పంపించాం . ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త పైపులైన్ ఏర్పాటుపై చర్యలు చేపడుతాం. ఎక్కడ లీకేజీలు ఏర్పడినా వెంటనే సరిచేసి గ్రామాలకు తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం ఎక్కడా కలుషిత నీరు సరఫరా కావడం లేదు.

– రామకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ, చిన్నచింతకుంట

• పలుమార్లు లీకేజీలు
• గ్రామాలకు కలుషితనీరు సరఫరా

చిన్నచింతకుంట: గ్రామాలకు తాగునీరు అందించే మిషన్ భగీరథ పైపులైన్ తరుచూ లీకేజీలు అవుతున్నాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు నీటి సరఫరా కలుషితమవుతుంది. కురుమూర్తిరాయ హెడ్‌ట్యాంక్ నుంచి అప్పంపల్లి వరకు సాయిబాబా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పాత పైపులైన్‌కే మిషన్ భగీరథ కనెక్షన్ కలపడంతో తరుచూ పైపులు పగిలి లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో మండలంలోని 13 గ్రామాలకు తాగునీటి సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. గ్రామాలకు నీరు ఎప్పుడు సరఫరా అవుతుందో కూడా ప్రజలకు తెలియడం లేదు. అధికారులు పైపులను సరిచేసి నీటిని వదిలిన అది కలుషితంగా సరఫరా అవుతుంది.


కురుమూర్తి వద్ద ఉన్న హెడ్ వాటర్ ట్యాంక్

నిధులు దుర్వినియోగం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీరు అందించే దిశలో రూ.కోట్లు ఖర్చు చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులను దుర్వినియోగ పరిచారు. పాత పైపులైన్లకే మిషన్‌భగీరథ కనెక్షన్లు ఇచ్చారు. అప్పట్లో మండలంలోని 13 గ్రామాలకు రామన్‌పాడు ప్రాజెక్ట్ నుంచి, మన్యంకొండ హెడ్ ట్యాంక్ నుంచి 9 గ్రామాలకు అప్పటి అధికారులు పైపులను అమర్చి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రామన్‌పాడు ప్రాజెక్ట్ నుంచి కురుమూర్తి హెడ్‌ట్యాంక్ వరకు కొత్తగా పైపులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ముచ్చింతల వరకు 40 సంవత్సరాల క్రితం షిరిడి సాయిబాబా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పాత పైపులైన్‌కు లింక్ కలిపారు. అందుకు కురుమూర్తి నుంచి ముచ్చింతల వరకు ఏదో ఒక చోట లీకేజీలు అవుతూనే ఉన్నాయి. దీంతో మండల కేంద్రం, అమ్మాపురం, తిర్మలాపూర్, మద్దూర్, ఏదులాపూర్, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల గ్రామాలకు నీరు సక్రమంగా అందకపోగా నాచు, బురద, వేర్లు వంటి కలుషితమైన నీరు సరఫరా అవుతుంది. పాత పైప్‌లైన్ తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాలల్లో సర్పంచులు, ఎంపీటీసీలు లేవనెత్తిన అధికారులలో స్పందన రాలేదు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

• ప్రయాణికులు సురక్షితం
• నలుగురికి స్వల్ప గాయాలు



జాతీయరహదారిపై రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

అలంపూర్: బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు రోడ్డు పక్కకు వెళ్లి ఆగడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఉండవెల్లి మండలం అలంపూర్‌చౌరస్తా సమీపంలోని ఉత్తర ఫుడ్స్- పుల్లూరు టోల్‌ప్లాజాకు మధ్యన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పీఆర్ఎల్(ఇంద్రాక్షి) ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రొద్దుటూరుకు 26 మంది ప్రయాణికులతో బయలుదేరింది. అలంపూర్ చౌరస్తా వద్ద ఉత్తర ఫుడ్స్ ఫ్యాక్టరీ సమీపంలో దాదాపు 3:30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బస్సు రోడ్డు దాటి కిందకు దూసుకెళ్లింది. బస్సు కిందకు బోల్తా పడకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు సురక్షితంగా బయపట్టారు. అయితే ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ జనార్ధన్ రెడ్డి కాలికి, లక్ష్మీదేవికి తలకు గాయం కావడంతో వారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందడంతో ఘటనపై ఆరా తీశారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఫోన్ ట్యాంపరింగ్‌పై ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ కార్యాలయం వద్ద బురుజు సుధాకర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: గత ప్రభుత్వ హయంలో వన్‌టౌన్ సీఐగా పని చేసిన అధికారితో పాటు కొంత మంది సిబ్బంది మాజీ మంత్రి ఆదేశాలతో ఫోన్ నంబర్లను ట్యాప్ చేశారని బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌కు 43వ వార్డు కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుంచి పట్టణంలో కొంత మంది ప్రముఖల ఫోన్ నంబర్లు ట్యాప్ చేశారన్నారు. ఎవరితో ఎవరూ మాట్లాడుతున్నారో తెలుసుకుని వెంటనే స్టేషన్‌కు పిలిచి బెదిరించేవారని, వినకుంటే తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ అంశంపై సరైన విచారణ చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడిపందెల శిబిరంపై దాడి

• 11 మంది అరెస్ట్, రూ.13,100 నగదు స్వాధీనం

నాగర్‌కర్నూల్: కోడిపందెలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్టు చేసిన ఘటన మండలంలోని చందుపట్ల శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్, తెలకపల్లి మండలాలకు చెందిన 11మంది కోడిపందాలు ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు 11 మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద రూ.13,100 నగదు తో పాటు ఆరు ద్విచక్ర వాహనాలు 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చేపల పెంపకంపై అవగాహన

పెబ్బేరు రూరల్: ఆక్వా ఫోనిక్స్ విధానంలో చేపలు, మొక్కల పెంపకంపై బుధవారం మండల కేంద్రంలోని మత్స్యకళాశాలలో ఎస్ఎంఆర్‌ఐ సాయంతో ఎస్సీ రైతులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ నాగలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమా, ఏఓ చంద్రమౌళి పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి తగ్గట్లు వ్యవసాయ పద్ధతులు కూడా మారాలని, తక్కువ స్థలం, తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే వ్యవసాయ విధానాలలో ఆక్వాఫోనిక్స్ ముఖ్యమైనదని పేర్కొన్నారు. వివిధ రకాల చేపల పెంపకాల గురించి, ఆక్వాఫోన్స్‌కి అనువైన చేపలు, మొక్కల గురించి వివరించారు.

ముగిసిన వట్టెం బ్రహ్మోత్సవాలు


గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులు

బిజినేపల్లి: వట్టెం వేంకటేశ్వరస్వామి 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. 22వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆలయ స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణచార్యులు, ప్రధాన అర్చకుడు వెంకట ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా హోమం, అభిషేకం నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో స్వామి వార్లకు చక్రస్నాన ఘట్టాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం పుష్పయాగ ద్వాదశారాధన, సప్తావరణంతో ధ్వజారోహణతో ఆరు రోజుల పాటు సాగిన బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ముగింపు కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కైంకర్యపరులు అనంత క్రాంతికుమార్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అడవులపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న ఎకో పార్క్‌లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రరెడ్డి అడవులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వాచ్ టవర్, వ్యూవ్ పాయింట్ వద్దకు విద్యార్థులను తీసుకెళ్లారు. ప్రకృతి సహజ సంపదలో అడవులు చాలా ముఖ్యమైనవని తెలిపారు. అడవుల వల్ల సమస్త జీవరాశికి కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అదేవిధంగా అనేక వన్యప్రాణులు ముఖ్యంగా సోమశిల అడవులలో పులి, జింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు తదితర జంతువులు నివసిస్తున్నాయని వివరించారు. పులి జీవన విధానాన్ని, వాటి పంజా గుర్తుల ఆధారంగా మగ, ఆడ పులులను గుర్తించే విధానాన్ని, ప్రకృతి సమతుల్యతతో దాని పాత్ర గురించి, పులులను కాపాడుకోవడంలో మానవుల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారి శ్యామ్ సుందర్ యాదవ్, అధ్యాపకులు రమేష్, కురుమయ్య, మౌనిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలీం ఆజాద్‌కు రంగస్థల పురస్కారం

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లికి చెందిన ఎండీ అబ్దుల్ కలీం ఆజాద్‌కు రంగ స్థల యువ పురస్కారం లభించింది. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరంచుకుని బుధవారం హైదరబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం వీసీ కిషన్‌రావు, లలిత కళాపీఠం పీఠాధిపతి డాక్టర్ కోట్ల హన్‌మంతరావు, బీహెచ్ పద్మప్రియ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.


పురస్కారం అందుకుంటున్న అబ్దుల్ కలీం ఆజాద్

తాతయ్య వర్ధంతి కోసం వస్తుండగా..

లారీ ఢీకొని మనవడు మృతి


పవన్‌కుమార్ (ఫైల్)

మరికల్: తాతయ్య వర్ధంతిని నిర్వహించేందుకు వస్తుండగా, లారీఢీకొని మనవడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంకెన్‌పల్లికి చెందిన ఎం. పవన్‌కుమార్ (21) కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం స్వగ్రామంలో తాతయ్య హన్మంతు వర్ధంతి ఉండటంతో పూలు, పండ్లు, ఇతర సామగ్రితో హైదరాబాద్ నుంచి అర్ధరాత్రి స్వగ్రామానికి బొలెరో వాహనంలో బయలుదేరాడు. ఈ క్రమంలో మరికల్ మండలం ఎలిగండ్ల స్టేజీ సమీపంలో ఉన్న మన్నెవాగు వద్ద తెల్లవారుజామున 3 గంటలకు రాయచూర్ నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో పవన్ కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

చెక్‌పోస్టుల వద్ద రూ.9.69 లక్షలు సీజ్

నాగర్‌కర్నూల్: జిల్లాలో ఉన్న ఆరు చెక్ పోస్టలలో ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో బుధవారం వరకు రూ.9,69,750 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 48 లిక్కర్ కేసులు చేసి 1,078 ఐఎంఎఫ్ఎల్, బీర్ బాటిల్స్, 4 లీటరల నాటు సారా సీజ్ చేసినట్లు తెలిపారు. 94 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 23 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

అనుమతి లేకుండా తరలిస్తున్న నగదు, కూలర్లు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసులు బుధవారం చేసిన తనిఖీల్లో పలు చోట్ల నగదు పట్టుబడింది. ప్రధానంగా టూటౌన్ పోలీసులు రూ.3లక్షల విలువ చేసే కూలర్లను పట్టుకున్నారు. కూలర్స్ తరలించే వాహన డ్రైవర్ సలీం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కూలర్లతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ స్వామిగౌడ్ వెల్లడించారు. దీంతో పాటు రూ.90వేల విలువ చేసే షర్ట్స్‌ను సీజ్ చేశారు. ఈ కూలర్స్‌ను విజయవాడ నుంచి ప్రత్యేకంగా పాలమూరులో పంపిణీ చేయడానికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. కూలర్లను స్థానికంగా ఓటర్లకు చేర్చడానికి ప్రయత్నం చేసినట్లు సమాచారం. బాలానగర్ పోలీసులు రూ.3లక్షలు, భూత్పూర్ పోలీసులు రూ.2లక్షల నగదు సీజ్ చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు ధర్మపూర్‌లో ఐదు లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేశారు.

ఏసీబీ వలలో గుండుమాల్ తహసీల్దార్

• భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇచ్చేందుకు రూ.3వేలు డిమాండ్
• వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
• తహసీల్దార్‌తో పాటు ధరణి ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్‌లపై కేసులు నమోదు



గుండుమాల్ తహసీల్దార్ కార్యాలయం


ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్, మరో ఇద్దరు అధికారులు


పట్టుబడిన నగదు

కోస్గి: భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్ ఇవ్వడానికి ఓ రైతు నుంచి లంచం డిమాండ్‌చేసిన గుండుమాల్ తహసీల్దార్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ వివరాల మేరకు.. గుండుమాల్ మండలం బోగారం గ్రామానికి చెందిన రైతు మల్లేష్ అమ్లికుంట్లకు చెందిన ఓ వ్యక్తితో ఎకరా భూమిని కొనుగోలుచేశారు. ఈనెల 21న భూమి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. 22న రిజిస్ట్రేషన్ చేసిన గుండుమాల్ తహసీల్దార్ పాండునాయక్.. డాక్యుమెంట్ ఇవ్వడానికి రూ. 3వేలు డిమాండ్ చేశాడు. తనవద్ద డబ్బులు లేవని రైతు చెప్పగా.. డాక్యుమెంట్ ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో చేసేదిలేక ధరణి ఆపరేటర్‌కు రూ.1000 ఫోన్‌పే చేసి, మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని డాక్యుమెంట్ తీసుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో రైతు మల్లేష్ మరో వ్యక్తికి 20 గుంటల భూమిని విక్రయించి, రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈక్రమంలో గతంలో తక్కువ డబ్బులు ఇచ్చావని.. ఈ సారి మొత్తం డబ్బులు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని తహసీల్దార్ మొండికేశాడు. ఇదేంటని ప్రశ్నించిన రైతుకు ఇక్కడ ఇలాగే ఉంటుందంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ.. రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించాడు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ముందస్తు ప్రణాళికలో భాగంగా రైతుకు రూ.2000 ఇచ్చి తహసీల్దార్ వద్దకు పంపించగా.. రికార్డు అసిస్టెంట్ మొగులప్పకు ఇవ్వాలని సూచించడంతో బాధిత రైతు అతడికి ఇచ్చారు. ఆ డబ్బులను రికార్డు అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతుతో లంచం తీసుకున్న తహసీల్దార్ పాండునాయక్‌తో పాటు ధరణి అపరేటర్ రవీందర్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ మొగులప్పలపై కేసులు నమోదు చేశామని.. వీరిని నాంపల్లి ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే, ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏసీబీ సీఐలు ఏఎస్‌కే జిలానీ, పి.లింగస్వామి తదితరులు ఉన్నారు. కాగా, ముఖ్యమంత్రి ఇలాకాలో తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరించారు..



భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇవ్వడానికి తహసీల్దార్ పాండునాయక్ డబ్బులు డిమాండ్ చేశాడు. ఇదేంటని అడిగితే ఇవ్వాల్సిందే.. లేదంటే నువ్వే ఇబ్బందులు పడుతావని బెదిరించాడు. రూ. 1,500 అడిగితే రూ.1000 ఇచ్చి, డాక్యుమెంట్ తీసుకున్నాను. మరోమారు నేను మరో వ్యక్తికి భూమి అమ్మితే పాతవి, కొత్తవి కలిపి రూ.2వేలు ఇవ్వాలని మరోమారు దబాయించడంతో ఏసీబీని ఆశ్రయించాను. ఏసీబీ అధికారుల సూచన మేరకు డబ్బులు ఇచ్చాను.

– మల్లేష్, రైతు, బోగారం

క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం(మహాజన సభ) గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహిస్తునట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలక వర్గం సభ్యులు, సంఘ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

రేపు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం



నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు తెలిపారు. బుధవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సుభజీవన్‌రెడ్డి గార్డెన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బూత్‌సెక్టార్ మండల, జిల్లా, గ్రామ కమిటీల నాయకులు, ఏడు అసెంబ్లీ పరిధిలో ఉన్న కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కాటమ్ విష్ణుతేజ, అసెంబ్లీ నాయకులు సుధాకర్, సత్యనారాయణగౌడ్, అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు 55 మందికి బీపీ, షుగర్‌తోపాటు ఇతర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఏఎన్ఎంలు రాధిక, శారదా, ఆశా కార్యకర్తలు లక్ష్మి, శ్రీలత, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన కృష్ణయ్య, పంజుగుల గ్రామానికి చెందిన రమేష్‌లు ఆర్థికభారంతో ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. ఈ విషయాన్ని వారు ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఇళ్ల నిర్మాణాల కోసం ఒక్కొక్కరికి 30 బ్యాగుల సిమెంట్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గణేష్, కిశోర్, రమేష్‌రాథోడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.1.66 లక్షల ఆదాయం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో వచ్చే నెలలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన వేలం పాటల ద్వారా ఆలయానికి రూ. 1.66 లక్షల ఆదాయం సమకూరిందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ తెలిపారు. కొబ్బరి కాయల అమ్మకాన్ని కొన్నర్తి నిరంజన్ రూ.1.02లక్షలకు, తైబజార్‌ను రూ.53 వేలకు మస్కాని లింగస్వామి, లడ్డూ అమ్మకాన్ని మన్న రవి రూ. 11 వేలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేటీ తిర్పతయ్య, బాలాజీ, ఎల్లేష్, ప్రభాకర్, రాజల్, లక్ష్మినర్సు, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా



తాడూరు: సింగిల్‌విండో చైర్మన్ పదవికి ఎండీ సమ్మద్‌పాషా బుధవారం రాజీనామా చేశారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రఘునందన్‌రావుకు రాజీనామా పత్రాన్ని ఇచ్చారు. అవిశ్వాస తీర్మాన సమావేశం ఏప్రిల్ 3న నిర్వహించాల్సి ఉండగా తన పదవికి ముందుగానే రాజీనామా చేయడంపై పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమైన చైర్మన్ సమ్మద్‌పాషాను వివరణకోరగా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

ఈత వనాలకు నిప్పు

- చౌటపల్లిలో ఘటన
- వందకు పైగా కాలిన ఈత చెట్లు



ఈత వనం పక్కన ద్విచక్రవాహనానికి నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



చౌటపల్లిలో కాలిన ఈత చెట్లు

అచ్చంపేట రూరల్: మండలంలోని చౌటపల్లి శివారులోని గీత కార్మికుడు మధు గౌడ్ నాలుగు ఎకరాల్లో ఈత వనాన్ని పెంచాడు. ఈ ఏడాది దశరథం అనే గీత కార్మికుడికి లీజుకు ఇచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దశరథంకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఈత వనం పక్కనే కాల్చారు. దీంతో పక్కనే ఉన్న కొన్ని చెట్లకు నిప్పు అంటుకొని కాలిపోయాయి. అదృష్టవశాత్తు వనానికి నిప్పు అంటుకోకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా గత నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ఈత వనానికి నిప్పు పెట్టడంతో వందకు పైగా చెట్లు కాలిపోయాయి. సుమారు రూ. 1.50వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది.

కేసు నమోదు

మండలంలోని చౌటపల్లి శివారు ఈతవనానికి నిప్పు పెట్టిన సంఘటనపై గీత కార్మికుడు దశరథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట ఎస్ఐ రాములు తెలిపారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కుల వృత్తే ఆధారం



కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాం. అగ్ని ప్రమాదాలకు గురై వందకు పైగా ఈత చెట్లు కాలిపోయాయి. ఉద్దేశపూర్వకంగా ఈత వనాలకు నిప్పువారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. జీవనోపాధి లేక రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడ్డది.
– దశరథం, గీత కార్మికుడు

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



ఇంద్రకల్‌లోని నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ



పెద్దకొత్తపల్లిలో

తాడూరు: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు ఇంద్రకల్‌లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనుల దగ్గర పనుల్లో పాల్గొనే కూలీలకు సౌకర్యాలు కల్పించి గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామసభలో ఎంపిక చేసిన పనుల మాత్రమే చేపట్టి జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్యోతివరోసియా, ఏపీఓ చంద్రసిద్ధార్థ, ఆయా గ్రామాల క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏపీఓ మంజుల మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 1470 మంది కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పీడర్‌చానల్, చెరువుకట్టలపై చెట్ల తొలగింపు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కొత్తగా పనులకు వచ్చే కూలీలందరికి పని కల్పించే బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లిలో ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ మోతీలాల్, ఎంపీఈఓ వెంకటయ్య, టీఏ రేణయ్యలు పరిశీలించారు. పనులు నాణ్యవంతంగా చేయాలని సూచించారు. నర్సరీలో మొక్కలు ఎండకుండా నీటి అందించాలని కోరారు.

రైతులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న విజయరామారావు

పెంట్లవెల్లి: రైతులకు అండగా ఉంటామని సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సహకార సంఘం కార్యాలయంలో సింగిల్‌విండో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈసందర్భంగా 1.10.2023 నుంచి 27.03.2024 వరకు ఖర్చుల గురించి చర్చించారు. అనంతరం రైతులకు రుణమాఫీ చేశామన్నారు. రుణాలు, విత్తనాలపై సంఘ సభ్యులు, డైరెక్టర్ల సలహాలు సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో గడ్డం శేఖర్, సత్యం, వెంకట్, వెంకటేశ్వర్లు, సురేందర్‌గౌడ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కరువు



పెద్దాపూర్ చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

వెల్దండ: గ్రామాల్లో వలసల నివారణకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. పనులు చేసే చోట సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి కూలీలకు వేతనాలు కూడా అందడం లేదు. ప్రతి వేసవిలో అందించే అదనపు అలవెన్స్‌లు సైతం నిలిపివేశారు. ఎండలు మండుతుండడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో సేదతీరేందుకు టెంట్లు కూడా ఏర్పాట్లు చేయడంలేదు. తాగునీరు సౌకర్యం కల్పించడం లేదు. కూలీలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. పారలు సమకూర్చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 14రోజుల్లో చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉన్నా కానీ మూడు నెలలు గడుస్తున్నా కూలి డబ్బులు ఇవ్వడం అందడం లేదని కూలీలు వాపోయారు. దీంతో ఉపాధి కూలీ పనులు చేసేందుకు కూలీలు వెనకడుగు వేస్తున్నారు.

9492మందికి జాబ్‌కార్డులు

మండలంలోని 32 గ్రామ పంచాయతీలల్లో మొత్తం 9492 జాబ్‌కార్డులు ఉన్నాయి. జాబ్‌కార్డులల్లో ఉన్న కుటుంబసభ్యులతో కలిపితే మొత్తం 17,775 మంది కూలీల ఉన్నారు. ఇప్పటి వరకు 11,620మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులకు వస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.

కనీస వసతులు కల్పించాలి



ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించడం లేదు. గ్రామాల్లో కూలీలు ప్రమాదాల భారీన పడుతున్నా పట్టించుకోవడం లేదు. కూలీలు వడ దెబ్బకు గురైతే వైద్యం అందించడానికి సరైన మందులు లేవు. సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నత అధికారులు స్పందించి వేసవిల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి.
–జబ్బునాయక్, గాన్‌గట్టుతండా

డబ్బులు ఇచ్చేందుకు కృషి



ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు సకాలంలో డబ్బులు అందించడానికి కృషి చేస్తాం. ప్రతి వారం మస్టర్లను పూర్తి చేసి కంప్యూటర్లలో ఆన్‌లైన్ చేస్తున్నాం. పనుల వద్ద వసతులు కల్పిస్తాం. జిల్లా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం. ఇప్పటి వరకు పనులు చేసిన వారి వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. మరో వారం రోజుల్లో కూలీడబ్బులు జమ అవుతాయి.
–ఈశ్వర్, ఇన్‌చార్జ్ ఏపీఓ, వెల్దండ

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పాన్‌గల్: జోగులాంబ గద్వాల జిల్లా లత్తిపురం గ్రామంలో జీపీ కార్మికుడు శ్రీనుపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి సుగ్రీవుడు, కోశాధికారి కిషన్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామానికి గొల్ల అంజి మద్యం తాగి పంచాయతీ కార్యదర్శి మల్లికతో గొడవ పడుతుంటే, వద్దని వారించిన కార్మికుడి దూషించి దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షిస్తూ.. ఇలాంటి గొడవలు మరోసారి జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ తరగతులలో పాఠ్యాంశాలలో ఉన్న కథలను, సన్నివేశాలను ఉపాధ్యాయుడు శ్రీశైలం నాటక రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సామ్య నాయక్, ఉపాధ్యాయులు శ్రీశైలం, జయమ్మ, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డులపరిశీలన



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్ నమోదు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కుమార్, ఫార్మసిస్ట్ అనురాధ, సిబ్బంది ఉన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు: కేసు నమోదు

బల్మూర్: మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య పిల్లలను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు అయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన మల్లేష్ రెండేళ్ల కిందట మంగమ్మను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త గ్రామానికి చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. తరుచుగా భార్యా పిల్లలను మల్లేష్ వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక బుధవారం మంగమ్మ భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

వృద్ధురాలిపై దాడి..

మండలంలోని చెంచుగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు బల్మూరి నర్సమ్మపై ఈనెల 18న అచ్చంపేటకు చెందిన బిజ్జా బాలు అనే వ్యక్తి దాడి చేశాడు. దాడిలో వృద్ధురాలికి చెయ్యికి గాయామైంది. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ కులాల విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు 3 నెలల ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అధికారి రాములాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి పట్టణంలోని విశ్వవికాస్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల జరుగుతాయని పేర్కొన్నారు. 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు చింతకుంట, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, గోప్లాపూర్, రేమద్దుల గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను బుధవారం తహసీల్దార్ సుభాష్‌నాయుడు, డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేష్ మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న మిల్లులు వినియోగంలో ఉన్నాయా, లేదా, మిల్లులకు కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా సీఎంఆర్ బియ్యం నిర్దేశించిన ప్రకారం సరఫరా చేస్తున్నాయా లేదా.. ఇంకా ఎంతవరకు సరఫరా చేయాలి అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి ఆయా వివరాలను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సఖీ సెంటర్ కో-ఆర్డినేటర్ సునీత

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని నెలికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల చట్టం 2013పై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కోఆర్డినేటర్ సునీత పాల్గొని మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టంపై అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పని ప్రదేశాలలో వేధింపులకు గురైనప్పుడు సంబంధిత కమిటీకి ఫిర్యాదు చేస్తే 90 రోజుల్లో పరిష్కరిస్తారన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సమన్వయకర్త బి.ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబీ, అధ్యాపకులు రమ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

లింగాల: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం, వివిధ శాఖల సిబ్బందితో ఎంపీడీఓ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పనుల అమలుపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి పనులలో కూలీల సంఖ్యను పెంచాలని, ఎన్ఎంఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని, సామాజిక తనఖీ కోసం పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం నాటికి అన్ని నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని, మొక్కలు ఎండి పోకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని పట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాంఅలీ, ఈసీ శ్రీనివాస్, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటాల పోటీలు



కోలాటం ఆడుతున్న యువతీ, యువకులు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయం ఆవరణలో నిర్వహించిన కోలాటాల పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. పోటీల్లో ఏడు బృందాలు పాల్గొనగా విజేతలుగా మల్కాపురం, తాండ్ర, అంబటిపల్లి, గడ్డంపల్లి కోలాట బృందాలు నిలిచాయి. అదేవిధంగా బుధవారం ఆలయం ఆవరణలో ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, బైక్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్ వినియోగం



పంచాయతీ ట్రాక్టర్‌లో తడకలను తరలిస్తున్న డ్రైవర్

లింగాల: గ్రామ పంచాయతీలలో చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డులకు తరలించడం, మొక్కలకు నీటి సరఫరాను చేయుట, ఇతర అవసరాల కోసం గత ప్రభుత్వం గ్రామ పంచాయతీకు ట్రాక్టర్లను పంపిణీ చేసింది. మండలంలోని అంబట్‌పల్లి గ్రామ పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్ డ్రైవర్ ప్రైవేట్ పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నాడు. బుధవారం ట్రాక్టర్ ట్రాలీలో తడకలు తరలించాడు. ప్రత్యేక అధికారికి, కార్యదర్శికి తెలియకుండా ప్రైవేటు పనులకు, స్వంత పనులకు ట్రాక్టర్‌ను వియోగించుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని డ్రైవర్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. అనుమతి లేకుండా ట్రాక్టర్‌ను పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు తీసుకెళ్లొద్దని ఆదేశించారు.

సమాచారం లేకుండా చెట్లను లెక్కించొద్దు

చారకొండ: సమాచారం లేకుండా చెట్లను లెక్కించొద్దని బుధవారం ఫారెస్టు అధికారి వెంకటరమణకు ఎర్రవల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. చెట్లను లెక్కించేందుకు ఫారెస్టు అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఈమేరకు అధికారులను కలిసి ఎర్రవల్లి రిజర్వాయర్‌ను వ్యతిరేకిస్తున్నామని గ్రామస్తులు వివరించారు.



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జెడ్పీ సీఈఓ



కల్వకుర్తిరూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాసనమండలి సభ్యుడి పోలింగ్ గురువారం జరగనుంది. కల్వకుర్తిలో 72 ఓట్లు, జిల్లా మొత్తం 319 ఓట్లు ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం పోలింగ్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీఓ వెంకట్‌రాములు, సిబ్బంది ఉన్నారు.